సాక్షి
నంద్యాల
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న ప్రాణదాన ట్రస్ట్‌కు అనంతపురానికి చెందిన పి.హరిప్రసాద్ గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



కమనీయం.. కల్యాణం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతుల కల్యాణం గురువారం పండితులు ఆధ్వర్యంలో కమనీయంగా సాగింది.



దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం

వర్షాలతో ఆగిపోయిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కర్నూలులో గురువారం పునఃప్రారంభమయ్యాయి. 8లో▶

న్యూస్‌రీల్

పేటీఎం ద్వారా శ్రీనిధి రుణవాయిదాల చెల్లింపు



పొదుపు మహిళలకు పేటీఎంను అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ

నంద్యాల(న్యూటౌన్): పేటీఎం ద్వారా శ్రీనిధి రుణవాయిదాలు చెల్లింపు ప్రక్రియ శ్రీనిధి మహిళా బ్యాంకు నూతనంగా చేపట్టిందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పగిడ్యాల, వెలుగోడు, నంద్యాల మండలాల్లో పేటీఎం మెషీన్లను ఏర్పాటు చేశామన్నారు. శ్రీనిధి ద్వారా ఒక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు గరిష్ఠంగా రూ.లక్ష వరకు 11 శాతం వడ్డీతో శ్రీనిధి జీవనోపాధి రుణం పొందవచ్చన్నారు. రుణవాయిదాలు ప్రతి నెలా పేటీఎం మెషీన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ విధానం వల్ల సభ్యులు చెల్లించిన రికవరీలు తక్షణమే సభ్యురాలి లోన్ ఖాతాకు జమ అవుతాయన్నారు. రుణ ఖాతాకు జమ అవ్వడం వల్ల సభ్యులకు అదనపు వడ్డీ పడదన్నారు. పొదుపు సంఘాల సభ్యులందరూ జీరో ఎస్‌బీ బ్యాంక్‌అకౌంట్‌లో ఏటీఎం ద్వారా చెల్లించడం వల్ల ఎటువంటి అదనపు చార్జీలు పడవన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): శ్రీశైలం ప్రభుత్వ ఐటీఐలో వివిధ కోర్సులలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023–24 విద్యా సంవత్సరానికి రెండేళ్ల కోర్సులు ఫిట్టర్, టర్నర్, మోటార్ మెకానిక్ కోర్సులకు పదవ తరగతి పాసైన విద్యార్థులు, ఏడాది కోర్సుకు వెల్డర్ ట్రేడ్‌లలో చేరేందుకు పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు www.iti.ap.gov.in లో దరఖాస్తు చేసుకుని, ఈనెల 20వ తేదీలోపు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలన్నారు. 22న ఒరిజినల్ సర్టిఫికెట్లతో శ్రీశైలం ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9705683537, 9502722811 సంప్రదించాలన్నారు.

క్రమంగా పెరుగుతున్న శ్రీశైలం డ్యాం నీటిమట్టం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ జూరాల ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పాదన జరుగుతుండడం, సుంకేసుల నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో గురువారం సాయంత్రం సమయానికి 28,981 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. బుధవారం నుంచి గురువారం వరకు ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.179 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. అనంతరం 339 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,315, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,033 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 85.7503 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 852.50 అడుగులకు చేరుకుంది.

‘న్యాయం’ చేయక.. ‘సైకిల్’ కదలక!

ప్రతి ఐదేళ్లకోసారి సార్వత్రిక ఎన్నికల్లో కనీస పోటీ ఇవ్వాలని గట్టిగా ప్రయత్నించడం, చతికిలపడటం టీడీపీకి అలవాటైపోయింది. రానున్న ఎన్నికల్లోనూ మరోసారి అదృష్టం పరీక్షించుకునేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తున్నా.. ఆ పార్టీలోని వాతావరణం చూస్తే కనీస పోటీ కూడా ఇచ్చే పరిస్థితి లేకపోవడం గమనార్హం. నియోజకవర్గాల్లో విభేదాలు.. పార్టీ అనుసరిస్తున్న వైఖరి.. న్యాయ రాజధాని విషయంలో కక్షపూరిత నిర్ణయం.. వెరసి పార్టీ అధఃపాతాళంలోకి పడిపోయింది. కీలక నేతలు దాదాపుగా వైఎస్సార్‌సీపీలో చేరిపోవడంతో ‘పచ్చ’ పార్టీకి రానున్న ఎన్నికల్లోనూ గత ఫలితాలే ఖాయమనే అభిప్రాయం విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. – సాక్షి ప్రతినిధి కర్నూలు

ఇదేమి ‘న్యాయం’ బాబూ!

ఈ ఏడాది మూడురోజుల పర్యటనకు వచ్చిన చంద్రబాబు కర్నూలుకు న్యాయరాజధాని అవసరం లేదని మాట్లాడారు. గాయత్రి ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలతో న్యాయరాజధాని వద్దు అనే నినాదాలు చేయించారు. దీంతో అధికారపార్టీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. అడుగడుగునా చంద్రబాబును ప్రజా సంఘాలు అడ్డుకున్నాయి. తాజాగా అనంతపురం జిల్లా పర్యటనలోనూ కర్నూలుకు న్యాయరాజధాని అవసరం లేదని వ్యాఖ్యానించడం గమనార్హం.



ఉమ్మడి జిల్లాలో కోలుకోని టీడీపీ

- 14 నియోజకవర్గాల్లోనూ సంకట స్థితి
- 20 ఏళ్లలో అత్యధిక గెలుపు స్థానాలు నాలుగే..
- గత ఎన్నికల్లో సున్నాకే పరిమితం
- నేతల మధ్య విభేదాలతో పార్టీ శ్రేణుల్లో అయోమయం
- న్యాయ రాజధాని విషయంలో కక్షపూరిత వ్యవహారం
- నేడు నంద్యాల, రేపు కర్నూలు జిల్లాలో చంద్రబాబు పర్యటన

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నేటి నుంచి రెండురోజుల పాటు నంద్యాల, కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. బహిరంగసభలతో పాటు కార్యకర్తలతో భేటీ కానున్నారు. అయితే గత నాలుగున్నరేళ్లుగా కర్నూలు జిల్లా అభివృద్ధికి టీడీపీ అడుగడుగునా అడ్డు పడుతోంది. న్యాయ రాజధాని విషయంలోనూ చంద్రబాబు తీరు ప్రజలతో పాటు ప్రజాసంఘాల ఆగ్రహానికి కారణమవుతోంది. ఆయన తీరుతో పార్టీ శ్రేణులు కూడా డీలాపడ్డాయి. అసలే జిల్లాలో పరిస్థితి ఘోరంగా ఉన్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు పార్టీని మరింత ఇరకాటంలోకి నెడుతున్నాయనే అభిప్రాయం ఆ పార్టీ నేతల్లోనే వ్యక్తమవుతోంది.

అడుగడుగునా అసమ్మతి జ్వాల

నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని ప్రతీ నియోజకవర్గంలో నేతల మధ్య అసమ్మతి జ్వాల రగులుతూనే ఉంది. ఆళ్లగడ్డలో మాజీమంత్రి అఖిలప్రియ, ఏవీ సుబ్బారెడ్డి వర్గీయులు లోకేశ్ పాదయాత్రలో బాహాబాహీకి దిగారు. ఏవీ సుబ్బారెడ్డిని రక్తం వచ్చేలా గాయపరిచారు. దీంతో అఖిల ఓటమే లక్ష్యంగా పని చేస్తానని ఏవీ భీష్మించారు. మరో వైపు తన వియ్యంకుడు బోండా ఉమ ద్వారా ఆళ్లగడ్డ బరిలో తన కుమార్తెను దింపే యోచన కూడా చేస్తున్నారు.

➤ డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డికి టిక్కెట్ ఇవ్వొద్దని, అతనికిస్తే పనిచేసే ప్రసక్తే లేదని కేఈ ప్రభాకర్ వర్గీయులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. సుబ్బారెడ్డిని అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించినా, కేఈ ప్రభాకర్ మాత్రం తాను బరిలో ఉంటానని తేల్చిచెప్పారు. ధర్మవరం సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా లోకేశ్ పాదయాత్రలో కరపత్రాలు కూడా పంపిణీ చేశారు. దీంతో కేఈ వర్గీయులు టీఈ కేశన్నగౌడ్, తొప్పెల శ్రీనివాసులును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ గ్రాఫ్

సంవత్సరం	2004	2009	2014	2019
గెలిచిన సీట్లు	3	4	3	0

➤ నంద్యాలలో అఖిలప్రియ, భూమా బ్రహ్మానందరెడ్డికి కనీసం మాటలు కూడా లేవు. వీరి విభేదాల నేపథ్యంలో ఫరూక్ తన కుమారుడు ఫిరోజ్‌కు టిక్కెట్ దక్కించుకోవాలని పావులు కదుపుతున్నారు.

➤ ఆలూరులో నాలుగు వర్గాలుగా టీడీపీ చీలిపోయింది. కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జున, శివప్రసాద్, వీరభద్రగౌడ్ ఒకరికొకరు సహకరించుకునే పరిస్థితి లేదు. కుటుంబానికి ఒకే టిక్కెట్ అని టీడీపీ పాలసీగా తీసుకోవడంతో సూర్యప్రకాశ్‌రెడ్డికి టిక్కెట్ ఇస్తే సుజాతమ్మకు టిక్కెట్ రాదనే కారణంతో తక్కిన ముగ్గురు సుజాతమ్మకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు.

➤ మంత్రాలయంలో కూడా తిక్కారెడ్డికి వ్యతిరేకంగా వాల్మీకి నేతలు ముత్తురెడ్డి, ఉలిగయ్య పనిచేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బోయ సామాజికవర్గం అధికంగా ఉండటంతో వారు కూడా టిక్కెట్ వస్తుందనే ఆశతో ఉన్నారు. ఇక్కడ వీరు తిక్కారెడ్డికి సహకరించే పరిస్థితి లేదు.

హైదరాబాద్‌కే పరిమితమైన కోట్ల

కుటుంబానికి ఒకే టిక్కెట్ అని చంద్రబాబు స్పష్టం చేయడం, ఎమ్మిగనూరుపై పెట్టుకున్న ఆశలు అడియాశలు కావడంతో సూర్యప్రకాశ్‌రెడ్డి కర్నూలు కంటే హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉంటున్నారు. ఎమ్మిగనూరులో కోట్ల వర్గీయులు కృష్ణారెడ్డి, రంగముని నాయుడు, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్‌శెట్టి, ఆదెన్న, పార్థసారథిరెడ్డి, వీరారెడ్డి లాంటి కీలక నేతలు జయనాగేశ్వరరెడ్డికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. ఇక్కడ పార్టీ కార్యాలయాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి. కోడుమూరులో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి తీవ్ర విభేదాలు ఉన్నాయి. లోకేశ్ పాదయాత్రలో పుష్పగుచ్ఛం ఇవ్వడం మినహా విష్ణు కనీసం ఒక అడుగు కూడా లోకేశ్‌తో కలిసి నడవలేదు. చివరకు కోడుమూరు బహిరంగ సభకు కూడా గైర్హాజరయ్యారు. కర్నూలులో తండ్రి టీజీ వెంకటేశ్ బీజేపీలో, కుమారుడు భరత్ టీడీపీలో ఉన్నారు. దీంతో వీరు ప్రజల్లో పూర్తిగా విశ్వసనీయత కోల్పోయారు.

కీలక నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని సామాజికవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు అధికమయ్యాయి. కర్నూలులో మైనార్టీ నేత అహ్మద్ అలీఖాన్, ఆలూరులో బోయ సామాజికవర్గం నుంచి బొజ్జమ్మ, నంద్యాలలో బలిజ వర్గం నుంచి శాంతిరాం.. ఇలా ప్రతీ సామాజికవర్గం నుంచి కీలక నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. దీంతో అత్యంత బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుంటే.. బలహీనంగా ఉన్న టీడీపీ ఉనికి కూడా కోల్పోతోంది.



పంచాయతీ కార్యదర్శిని హెచ్చరిస్తున్న డీపీఓ మంజులవాణి



రోగులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

కదిలిన అధికార యంత్రాంగం

- రెండవ రోజూ క్యూ కట్టిన రోగులు
- కిక్కిరిసిన ఆసుపత్రి ప్రాంగణం
- రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే

పగిడ్యాల: అతిసారం కేసులు విజృంభిస్తుండడంతో పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం జిల్లా అధికార యంత్రాంగం కదలివచ్చింది. రెండు రోజుల్లో 50 మంది వాంతులు, విరేచనాల బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పెరుగుతున్న రోగుల సంఖ్యతో ఆసుపత్రి ప్రాంగణం కిక్కిరిసింది. అస్వస్థతతో వచ్చిన రోగులకు వైద్యులు మోహన్, అనిల్‌కుమార్, పారుమంచాల వైద్యాధికారిణి యశస్వినీలు వైద్యసేవలు అందించారు. జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సీహెచ్ మనోహర్ బీరవోలు, ఆంజనేయనగర్ గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరా ట్యాంక్‌లు, ట్యాప్‌లు, పైప్‌లైన్‌లను పరిశీలించారు. ట్యాంక్ పరిసరాల వద్ద మురుగు నీరు నిల్వ ఉండడాన్ని గుర్తించి.. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డికి మెమో జారీ చేస్తామని డీఎంహెచ్‌ఓ మంజులవాణి హెచ్చరించారు. ఇంటింటి కుళాయి కనెక్షన్ కలిగిన ప్రతి ఇళ్లను సందర్శించి నీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని రోగులకు ధైర్యం చెప్పారు. అందుతున్న వైద్యసేవలపై వైద్యాధికారి మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బీరవోలు, ఆంజనేయనగర్ గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సీరియస్ కేసులు ఉంటే 108 వాహనాల్లో కర్నూలుకు పంపాలని వైద్యాధికారికి ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ రవికుమార్ తదితరులు ఉన్నారు.



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందకిశోరా.. నవనీత చోర!

- భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్ శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమ్మవార్లకు నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరస్వాములను ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనాలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను రాధాకృష్ణులుగా అలంకరించి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తులను పూల పల్లకీలో కొలువుంచి మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారన్‌ల ఆధ్వర్యంలో జరిగాయి

శ్రీశైలంలో..

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని గోకులంలో గురువారం గోకులాష్టమి సందర్భంగా గో పూజలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని నిత్య సేవతో పాటు గోశాలలో గోవులకు, గోవత్సాల (ఆవుదూడలు)కు శ్రీసూక్తం, గోఅష్టోత్తర మంత్రం, గోవులకు షోడశ ఉపచార పూజలను అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని పూజ జరిపించారు.



వేణుగోపాలస్వామి, అమ్మవార్ల అలంకరణలో కొలువైన ఉత్సవ మూర్తులకు తిరుమంజనం



గోవులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయాధికారులు

ఎవరైనా పేదోళ్లకు మేలు చేయాలి. చేతకాకపోతే చేసిన వారిని మెచ్చుకోవాలి. అదీ లేకపోతే మిన్నకుండిపోవాలి. ఇవన్నీ పక్కనపెట్టి మేలు జరగకుండా ఓ పుల్ల అడ్డేసేవారు.. పేదలు బాధపడుతూ ఉంటే ఆనందించేవారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డిది ముందువరుస. గతంలో బనగానపల్లె పట్టణంలో ఇంటి స్థలాల విషయంలో కోర్టులో కేసు వేసి 3 వేల మంది పేదలకు పట్టాలు రాకుండా అడ్డుకున్న బీసీ జనార్ధనరెడ్డి.. ప్రస్తుతం పేదలకు సాగు భూమి ఇచ్చే విషయంలోనూ అడ్డుపడుతూ తన నీచ రాజకీయాన్ని బయటపెట్టాడు. వందలాది మంది నిరుపేదలు చీదరించుకుంటున్నా తన నైజమింతేనన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. – కొలిమిగుండ్ల

పిటిషన్ల బీ‘ఛీ’

పేదలకు భూములు పంచకుండా బీసీ జనార్దనరెడ్డి అడ్డు

- లైమ్‌స్టోన్ వంకతో కోర్టులో పిటిషన్
- ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకొని తప్పుడు కథనాలు
- గతంలో ఇంటి పట్టాల విషయంలోనూ రాజకీయం
- చీదరించుకుంటున్న ప్రజలు



పెద్దల కోసమే పేదలకు పంపిణీ!

ఇటీవల ఈనాడు ప్రచురించిన అసత్య కథనం

బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలంలో ఎనిమిదవ విడత భూపంపిణీకి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నడుంబిగించారు. 2018లో టీడీపీ హయాంలో విడుదల చేసిన జీఓ 250 ప్రకారం భూపంపిణీకి శ్రీకారం చుట్టారు. గొర్విమానుపల్లె, చింతలాయిపల్లె, కోటపాడు, అబ్దుల్లాపురం తదితర గ్రామాల నుంచి వందలాది దరఖాస్తులు వచ్చాయి. 2018లో టీడీపీ హయాంలో విడుదల చేసిన జీఓ 250 ప్రకారం 698 మందిని అర్హులుగా గుర్తించారు. భూపంపిణీకి రికార్డుల ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డికి కడుపు మండిందో ఏమో.. సిమెంట్ పరిశ్రమలకు ఉపయోగించే లైమ్‌స్టోన్ ఖనిజాలున్న భూములను పంపిణీ చేస్తున్నారని, ఆ భూములు సాగుకు ఉపయోగపడవని కోర్టులో పిటిషన్ వేసి పేదల ఆశలపై నీళ్లు చల్లారు.

భూములన్నీ సాగుకు అనుకూలమైనవే..

గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఇచ్చే అసైన్డ్ భూములన్నీ వంద శాతం సాగుకు ఉపయోగపడతాయి. భూపంపిణీ జరిగే గ్రామాల్లో లబ్ధిదారులు భూముల్లో యంత్రాలతో కంపచెట్లు తొలగించి భూమిని చదును చేసుకున్నారు. అబ్దుల్లాపురంలో పేదలకు ఇచ్చే ప్రభుత్వ భూముల సమీపంలోనే రైతులు బోర్ల కింద వరి సాగు చేస్తున్నారు. ఈప్రాంతంలో పేదలకు భూమి ఇస్తే బోర్లు వేసుకొని పంటలు పండించుకునేందుకు ఎదురుచూస్తున్నారు. నాపరాతి గనులకు నిలయమైన మండలంలో క్రమేణా పరిశ్రమ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. ప్రజలకు భవిష్యత్‌లో వ్యవసాయమే జీవనాధారంగా మారబోతోంది. మైనింగ్ గ్రామాల్లోని మహిళలు గతంలో ఎన్నడూ ఇతర గ్రామాలకు కూలీ పనులకు వలస వెళ్లిన దాఖలాలు లేవు. రెండు, మూడేళ్ల నుంచి వ్యవసాయ పనుల కోసం ఇతర ప్రాంతాలకు ఆటోల్లో వందల సంఖ్యలో వెళ్తున్నారు. భూమి ఉంటే నిరుపేదలు స్వంత పనులు చేసుకునే అవకాశముంది.



గొర్విమానుపల్లెలో భూపంపిణీ కోసం గుర్తించిన భూమి

ఎల్లో మీడియాలో అసత్యకథనాలు

భూపంపిణీపై ఎల్లో మీడియా కొన్నిరోజులుగా అసత్య కథనాలు ప్రచురిస్తోంది. గొర్విమానుపల్లెలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన లీజులో ఉండే ప్రాంతాన్ని ఫొటో తీసి ఇవి భూములు పంపిణీకి సిద్ధం చేశారని, ఇవి సాగుకు ఉపయోగపడవని ప్రజలను తప్పుదోవ పట్టించేలా కథనాన్ని అల్లారు. వాస్తవంగా అక్కడ కొండల మధ్య సాగుకు అనువుగా ఉన్న భూమిని 326 మంది లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధం చేశారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుల పరిశీలన

అసైన్‌మెంట్ చట్టం ప్రకారం భూపంపిణీ కోసం వచ్చిన దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ చేశాం. అర్హత ఉన్న వారిని మాత్రమే గుర్తించాం. చాలా దరఖాస్తులు వచ్చినా నిబంధనల పాటించి అర్హులను గుర్తించాం. – తహసీల్దార్, డోనీ అల్‌ఫ్రెడ్

బీసీకి కడుపు మంట ఎందుకో



రోజు కూలీ పనికి వెళ్లి జీవనం సాగిస్తున్నాం. సెంటు భూమి లేదు. ప్రభుత్వం మాకు భూమి ఇస్తుంటే బీసీ జనార్దనరెడ్డికి కడుపు మంట ఎందుకో తెలియడం లేదు. ఇప్పటికే కంప చెట్లు తొలగించి సిద్ధం చేసుకున్నాం. మాలాంటి పేదోళ్లకు భూమి ఉండటం ఇష్టం లేదేమో. – నాగలక్ష్మి, గొర్విమానుపల్లె

పుష్కలంగా పంటలు పండుతాయి



స్వంత భూమి లేకపోవడంతో వ్యవసాయ పనులకు పోతున్నాం. ప్రభుత్వం నుంచి భూమి వస్తుందని తెలిసి సంతోషించాం. అంతలోనే బీసీ జనార్దనరెడ్డి కోర్టులో కేసు వేయడంతో ఆగిపోయిందని తెలిసి బాధ పడ్డాం. మాకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన అసైన్డ్ భూముల్లో పుష్కలంగా పంటలు పండుతాయి. ఎందుకోసం కేసు వేశాడో ఆయనకే తెలియాలి. – వినయ్‌కుమార్, అబ్దుల్లాపురం

క్లుప్తంగా

ఐటీఐలో నాలుగో విడత ప్రవేశాలు

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఆర్.కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి మొదటి, రెండు, మూడు విడతల ప్రవేశాల తర్వాత మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరు 20వ తేదీన ఆయా కాలేజీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కాలేజీల్లో 22న, ప్రైవేటు కాలేజీల్లో 23న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఆయా కాలేజీల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆయా ప్రాంతాల్లోని కాలేజీల్లో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ర్యాలీలో కమిషనర్, మున్సిపల్ ఉద్యోగులు

కర్నూలు (టౌన్): పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అని కర్నూలు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగర పాలక సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగుల చేత పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకుంటూ అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య గ్లోబల్ వార్మింగ్ అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా పర్యావరణ హిత జీవన శైలిని అలవర్చు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిప్రసాద్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి, ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

గోరుకల్లులో 8 టీఎంసీల నీరు


గోరుకల్లులోకి వస్తున్న నీరు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయంలో 8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి జలాశయంలోకి 1,500 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. ఎస్సార్బీసీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 5వేల క్యూసెక్కుల నుంచి 1,500 క్యూసెక్కులకు తగ్గిపోయిందని అధికారులు తెలిపారు.

మురిసిన ఆబాలగోపాలం


కర్నూలు: శ్రీకృష్ణ రథయాత్రలో కలశాలతో మహిళలు


కర్నూలు: గోదాగోకులంలో గోపూజ చేస్తున్న భక్తులు


జూపాడుబంగ్లా: పారుమంచాలలో పల్లకీ మోస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మంత్రాలయం: శ్రీమఠంలో ఉట్టి కొడుతుండగా రంగులు చల్లుతున్న భక్తులు


నంద్యాల: ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ, బలభద్ర, సుభద్రలు


ఆలూరు: నేమకల్లులో శ్రీకృష్ణుడి పల్లకోత్సవం


ఆదోని: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంబరాన్నంటాయి. పలు గ్రామాలు, పట్టణాల్లో గోకుల నందనుడి రథోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఉట్లోత్సవాలు... పల్లకోత్సవాలు వేడుకలకు మరింత శోభను తెచ్చాయి. గోవర్ధనుడిని ప్రత్యేకంగా అలంకరించి, మండపాల్లో కొలువుంచి పూజలు చేశారు. శ్రీకృష్ణుడి మహిమలను ఇస్కాన్ సభ్యులు భక్తులకు వివరించారు. గోపూజలు చేసి.. గోపాలుడి వేడుకల్లో అబాలగోపాలం మురిసిపోయింది. –సాక్షినెట్‌వర్క్


బేతంచెర్ల: బృందావనంలో ఉట్టికొడుతున్న దృశ్యం


కర్నూలు: చిత్తారి వీధిలో ఉట్లోత్సవం

మహిళ హత్య కుట్ర భగ్నం

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


నిందితులను చూపిస్తున్న ఎస్‌ఐ మౌలానీ

కోవెలకుంట్ల: మహిళ హత్య కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. వివరాలను గురువారం సీఐ నారాయణరెడ్డి విలేకరులకు వెల్లడించారు. కోవెలకుంట్లకు చెందిన లక్ష్మీనరసమ్మకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్తతో విబేధాలు రావడంతో నాలుగేళ్ల నుంచి భర్తకు దూరంగా ఉంటూ పుట్టిల్లు కోవెలకుంట్లలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. బనగానపల్లె పట్టణంలోని పీమార్ట్‌లో సేల్స్‌ఉమెన్‌గా పనిచేస్తోంది. ఇదే ఇదే షాపులో బిల్లింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న భీమునిపాడుకు చెందిన రవితో పరిచయం ఏర్పడటంతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరి పిల్లలను వదిలేసి వస్తేనే వివాహం చేసుకుంటానని రవి చెప్పడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఇద్దరి మధ్య కొన్ని నెలల నుంచి మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. అప్పటి నుంచి లక్ష్మీనరసమ్మ పీమార్ట్‌లో ఉద్యోగం మానేసి ఓ దుస్తుల దుకాణంలో సేల్స్‌ఉమెన్‌గా చేరింది. అయినప్పటికీ రవి ఫోన్ ద్వారా వేధిస్తున్నాడు. ఇదే విషయమై పది రోజుల క్రితం బనగానపల్లెలో ఇద్దరూ గొడవ పడగా లక్ష్మీనరసమ్మ.. రవిని చెప్పుతో కొట్టింది. అవమానంగా భావించిన అతడు.. హత్యకు పథకం రూపొందించాడు. బండిఆత్మకూరుకు చెందిన ధ్రువకుమార్, గోస్పాడు మండలం తేళ్లపురికి చెందిన నరసింహ, మరో ఇద్దరు యువకులతో కలిసి రవి బుధవారం కారులో కోవెలకుంట్లకు చేరుకున్నాడు. షాపు నుంచి రాత్రి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో కిడ్నాప్ చేసి హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం తిరుగుతుండటంతో పోలీసులు ఆపి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవం ఒప్పుకున్నారు. కారు, అందులో ఉన్న కత్తి, తాడును స్వాధీనం చేసుకుని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసులోని నిందితులైన ధ్రువకుమార్, నరసింహను అరెస్ట్ చేసి సూత్రధారుడు రవి, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ వివరించారు.

నెల రోజుల్లోనే న్యాయం

- బాధితులకు రూ.22.93 లక్షల పరిహారం

కర్నూలు (లీగల్): జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చొరవతో బాధితులకు నెల రోజుల్లోనే న్యాయం జరిగింది. మూడు వేర్వేరు కేసుల్లో బాధితులకు రూ.23 లక్షల పరిహారం అందింది. బాధితులు సంతృప్తి వ్యక్తం చేయడంతో కమిషన్ అధ్యక్షులు కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ ఈ కేసులపై గురువారం విచారణను ముగించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన బోయ వీరాంజనేయులు ఎల్‌ఐసీలో 2020 డిసెంబర్‌లో రూ.6 లక్షలకు బీమా తీసుకున్నారు. 2021 మే నెలలో కరోనాతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీమా సొమ్ము కోసం వీరాంజనేయులు భార్య వి.మాలతీ ఎల్‌ఐసీకి దరఖాస్తు చేసుకోగా.. 2017 సెప్టెంబర్ 19 నుంచి 2019 జులై 14న మధ్య రెండేళ్ల వ్యవధిలో వీరాంజనేయులు 39 రోజులు అనారోగ్యం కారణంగా సెలవు తీసుకున్నారంటూ ఎల్‌ఐసీ బీమా డబ్బు ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో మాలతి గత నెల మొదటి వారంలో కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. నోటీసులు అందుకున్న ఎల్‌ఐసీ... పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వారి తరపు న్యాయవాది సీహెచ్ జోగారావు నివేదించారు. ఈ మేరకు కమిషన్ ఆవరణలో మాలతికి రూ.6.18 లక్షల చెక్కును అందించారు. అలాగే మరో కేసులో ఉల్చాల యంగమ్మకు రూ.10 లక్షల చెక్కును ఎల్‌ఐసీ సంస్థ అందించింది. మరో కేసులో మ్యాక్స్‌లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ తరపు న్యాయవాది కె.జయంతి... ఫిర్యాదుదారుడు గొల్ల లింగయ్యకు రూ.6.75 లక్షల చెక్కును కమిషన్ చొరవతో అందించారు.

అంత్యక్రియల అడ్డగింత

- మృతదేహంతో తహసీల్దారు కార్యాయం ఎదుట ధర్నాకు దిగిన బంధువులు


మృతదేహంతో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బంధువులు

చాగలమర్రి: మృతదేహానికి శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుపడిన ఘటన తోడేండ్లపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. దీంతో మృతుని బంధువులు మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో ధర్నా విరమించి అంత్యక్రియలు పూర్తి చేశారు. వివరాలు.. తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన కరక్కల మార్కు(75) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పూడ్చటానికి శ్మశానంలో గుంత తవ్వేందుకు వెళ్లగా, ఇది తన భూమి అని అదే గ్రామానికి చెందిన గాలిపోతు సంజీవరాయుడు అడ్డుకున్నట్లు మృతుని బంధువులు తెలిపారు. విషయాన్ని తహసీల్దార్ సుభద్రమ్మకు ఫోన్ ద్వారా తెలిపినా ఆమె రాలేదన్నారు. దీంతో బాధితులు మృతదేహాన్ని ఆటోలో చాగలమర్రి తహసీల్దారు కార్యాలయానికి తరలించి అక్కడ ధర్నాకు దిగారు. దీంతో తహసీల్దార్ సుభద్రమ్మ పోలీసులతో పాటు తోడేండ్లపల్లె గ్రామానికి చేరుకొని శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. గాలిపోతు సంజీవరాయుడు పొలంలో మినుము పంట సాగు చేస్తుండటంతో వంక గట్టు పక్కనే గుంత తవ్వించి శవాన్ని పూడ్చే ఏర్పాటు చేశారు. అయితే మృతుని బంధువులు ససేమిరా అనడంతో ఎస్‌ఐ రమణయ్య బాధితులతో మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని పూడ్చారు.

దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం


అభ్యర్థుల ఛాతీ కొలతలు తీసుకుంటున్న సిబ్బంది, పరిశీలిస్తున్న డీఐజీ సెంథిల్ కుమార్


వంద మీటర్ల పరుగు పరీక్షలో పాల్గొన్న ఎస్‌ఐ అభ్యర్థులు

- ఎస్‌ఐ మెయిన్ పరీక్షకు తొమ్మిదో రోజు 345 మంది ఎంపిక

కర్నూలు (టౌన్): వర్షాలతో ఆగిపోయిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. రాయలసీమ జోన్‌కు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన ఎస్‌ఐ అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్‌పీ 2వ బెటాలియన్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం తొమ్మిదో రోజు 800 మంది అభ్యర్థులకుగాను 572 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం, ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకున్నారు. అనంతరం 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. 1,600 మీటర్ల పరుగు పరీక్షల్లో 461 మంది అభ్యర్థులు పాల్గొనగా 404 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగు పరీక్షల్లో పాల్గొన్న 404 మంది అభ్యర్థుల్లో 250 మంది అర్హత సాధించారు. లాంగ్ జంప్‌లో 404 మంది పాల్గొనగా 343 మంది అర్హత సాధించారు. ఎస్‌ఐ మెయిన్స్ పరీక్షలకు తొమ్మిదో రోజు 345 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు పోలీసు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. దేహదారుఢ్య పరీక్షలను కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌లు పర్యవేక్షించారు. దేహదారుఢ్య పరీక్షలకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ మార్కుల లిస్టులతో పాటు గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన మూడు సెట్ల జిరాక్స్ ప్రతులు కచ్చితంగా వెంట తీసుకురావాలని పోలీస్ అధికారులు తెలిపారు.

ధైవదర్శనానికి వెళ్లి వస్తూ..

- ఆగివున్న డీసీఎంను ఢీకొన్న కారు
- చిన్నారి దుర్మరణం
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు


మృతిచెందిన హిమాన్య


కారులో ఇరుక్కుపోయిన నారాయణస్వామిని బయటకు తీస్తున్న స్థానికులు

ఓర్వకల్లు: దైవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న డీసీఎంను కారు ఢీకొనడంతో.. ఓ చిన్నారి మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘనట మండల పరిధిలోని సోమయాజులపల్లె వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు చెందిన గొప్పరాజు విష్ణువర్దన్ కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని షిరిడీకి వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఔరంగబాద్ ఎయిర్ పోర్టు నుంచి షంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు విమానంలో వచ్చారు. అక్కడి నుంచి కారులో స్వస్థలానికి బయలుదేరారు. సోమయాజులపల్లెలోని ఓంశాంతి ఆశ్రమం వద్దకు రాగానే డ్రైవర్ నిద్ర మత్తులో కారును అదుపు చేసుకోలేక ఆగివున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో చిన్నారి హిమాన్య (16 నెలలు) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. విష్ణువర్దన్‌తో పాటు, కుటుంబ సభ్యులు నారాయణస్వామి, విజయ, స్వర్ణలత, లౌక్య తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఇరుక్కున్న నారాయణస్వామిని స్థానికుల సాయంతో పోలీసులు అతికష్టం మీద బయటకు తీశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజారెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే కాటసాని, మేయర్ పరామర్శ

కర్నూలు(హాస్పిటల్): ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కర్నూలు మెడికవర్ ఆస్పత్రిలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కాగా సాయంత్రం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా క్షతగాత్రులను సాయంత్రం హైదరాబాద్‌కు తరలించారు.

తిరిగి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


వీరేష్ (ఫైల్)

ఆదోనిఅర్బన్: పత్తి అమ్మి మోటారు సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన పాండవగల్లు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. కోల్మన్‌పేటకు చెందిన ఆదోని వీరేష్ (28) పత్తి అమ్మడానికి ఆదోనికి వచ్చాడు. పత్తి అమ్మి తిరిగి కోల్మన్‌పేటకు బైకుపై వెళ్తుండగా పాండవగల్లు గ్రామ సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి మామ ఈశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో అంతర్‌రాష్ట్ర దొంగలు?

కర్నూలు(టౌన్): కారులో వచ్చి అపార్ట్‌మెంట్లలో దోపిడీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగలను కర్నూలు పోలీసులు పట్టుకున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నలుగురు అంతర్‌రాష్ట్ర దొంగలు ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలో దోపిడీలకు పాల్పడిన ఘటనలు ఎక్కువగా నమోదయ్యాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు దోపిడీ ముఠాను పట్టుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. అపార్ట్‌మెంట్లలో జరిగిన పలు దోపిడీల్లో ఒకే కారు సీసీ పుటేజీల్లో కనిపించడంతో ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. మంగళవారం సాయంత్రం అదే కారు కర్నూలు మీదుగా వెళ్తున్నట్లు ఇక్కడి పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో డోన్ వైపు వెళ్తున్న కారును వెంబడించి పట్టుకున్నారు. కర్నూలు పోలీసుల అదుపులో ఉన్న ఈ ముఠాను రెండు రోజులుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

గ్రానైట్ క్వారీల తవ్వకాలకు భూముల పరిశీలన

కర్నూలు (న్యూసిటీ): గ్రానైట్ క్వారీల తవ్వకాలకు ఆస్పరి, తుగ్గలి మండలాల్లో భూములను పరిశీలించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఆస్పరి మండలం కారుమంచి గ్రామంలోని సర్వే నంబర్ 462/1, తుగ్గలి మండలం పెండేకల్ గ్రామంలో సర్వే నంబర్ 254/పీ లో ఉన్న భూముల్లో గ్రానైట్ క్వారీల ఏర్పాటుకు ఈ వేలం ద్వారా అనుమతులు ఇవ్వాలని మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే ఈ వేలం ద్వారా టెండర్లు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే కైరుప్పల గ్రామంలో ఉన్న క్వారీని తనిఖీ చేసి గ్రానైట్ రాళ్లను పరిశీలించామని చెప్పారు.

15 లోగా టీకా లక్ష్యం చేరుకోవాలి

- జిల్లా సమీక్షా సమావేశంలో ప్రత్యేకాధికారి లావణ్యలక్ష్మి



మాట్లాడుతున్న గోవిందనాయక్

నంద్యాల(సెంట్రల్): నిర్దేశించిన టీకా లక్ష్యాన్ని ఈనెల 15వ తేదీలోగా చేరుకోవాలని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర ప్రత్యేకాధికారి లావణ్యలక్ష్మి సూచించారు. గురువారం విజయవాడ నుంచి ఆమె పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి పశుసంవర్ధక శాఖాధికారి గోవిందనాయక్ మాట్లాడుతూ జిల్లాకు 500 టన్నులు సమీకృత దాణా పంపిణీని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకూ 208 టన్నులు రైతులకు సరఫరా చేశామని వివరించారు. గడ్డివిత్తనాలు 34.50 టన్నులు లక్ష్యం కాగా 31.50 టన్నులు పంపిణీ చేశామన్నారు. 40 గడ్డి కత్తిరింపు యంత్రాల్లో 22 యంత్రాల్ని పాడి రైతులకు అందజేశామన్నారు. బ్రూసెల్లోసిస్, ముద్దచర్మవ్యాధి, స్వైన్ ఫీవర్ టీకాలను ఈ నెల 15వ తేదీలోగా పంపిణీ పూర్తి చేస్తామన్నారు. జీవాలకు పారుడు వ్యాధి నివారణకు ఈ నెల 11వ తేదీ నుంచి టీకాల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో ఉప సంచాలకులు పి.వి.రమణమూర్తి, డి.వి.రమణ, నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకట సుబ్బారెడ్డి, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్లంబింగ్, శానిటరీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు ప్లంబింగ్, శానిటరీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారై చదవడం, రాయడం వచ్చిన యువకులకు ఉచిత భోజనం, హాస్టల్ వసతితో 30 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.